జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
20 గురువారం, ఆగస్టు 2026 పేజీలు:13










# హత్య కేసులో భార్య భర్తలకు జీవిత ఖైదు!

-ఐపీసీ 302 కింద జీవిత ఖైదు రూ.10 వేల జరిమానా

-పోలీస్ అధికారులను అభినందించిన అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు




# రైతుల ఆదాయం పెంచేందుకు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

రైతుల ఆదాయం పెంచడంతో పాటు నీటి వనరులు, భూసారాన్ని పరిరక్షించేందుకు ఉద్యానవన, తక్కువ నీటి వినియోగ పంటల సాగును ప్రోత్సహించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామంలో జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రైతులు, గ్రామ సర్పంచ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

మిగతా 2 లో

# ఎస్.ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి




జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 19 (ప్రజా జ్యోతి)**

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు కే. సురేంద్రమోహన్ సమీక్షనాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్.ఐ. ఆర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించాలని,ఓటర్ల జాబితా సవరణలో పొరపాట్లకు తావులే కుండా క్షేత్రస్థాయిలో ప్రతిఅంశాన్ని నిశితంగా పరిశీలించాలనిభారత ఎన్నికల సంఘం నాగర్ కర్నూల్ జిల్లాకు నియమించిన జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి కే.సురేంద్రమో హన్ అధికారులను ఆదేశించారు.బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాను సందర్శించిన ఆయన ముందుగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు.

మిగతా 11 లో

# రైతుల ఆదాయం పెంచేందుకు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి : ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

**పంటల మార్పిడితో అధిక ఆదాయం:**
సదస్సులో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు. తక్కువ వర్షపాతం, భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే పంటలను ఎంచుకోవాలని అన్నారు. రైతులకు ప్రభుత్వం నాణ్యమైన కూరగాయల నారు, విత్తనాలు, మల్చింగ్, పందిళ్ల సాగు వంటి సదుపాయాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సమూహాలుగా ఏర్పడి సాగు వివరాలను ఉద్యానవన శాఖకు అందిస్తే అవసరమైన నారును తెప్పించి అందించే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని సూచించిన ఎమ్మెల్యే, కొత్తకోట సమీపంలోని శంకరెడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే మార్కెటింగ్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీలు త్వరగా మంజూరు చేయాలని అధికారులను కోరారు. దేవరకద్ర నియోజకవర్గంలోని గ్రామాల్లో తక్కువ వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్‌ను ఎమ్మెల్యే కోరారు. భూత్పూర్‌లో విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**వ్యవసాయంతో అనుబంధ రంగాలను సమన్వయం చేసుకోవాలి:**
టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కేవలం ఒకే పంటకు పరిమితం చేయకుండా పాడి, మేకల పెంపకం, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు వంటి అనుబంధ రంగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కొత్త పంటలను ముందుగా చిన్న విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేసి, ఫలితాలను బట్టి విస్తరించాలని అన్నారు. మార్కెట్ అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందేలా రైతులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మట్టిని పరిరక్షించడం అత్యంత ముఖ్యమని, పంట అవశేషాలను కాల్చకుండా సేంద్రియ పదార్థాలుగా మార్చి భూమికి అందించాలని రైతులకు సూచించారు.

**వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు: కలెక్టర్**
జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అనిశ్చిత వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగు విధానంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. వరి, పత్తితో పాటు కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, నువ్వులు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని అన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తమ గ్రామాల్లో కొంతమంది రైతులతో ప్రయోగాత్మకంగా పంటల మార్పిడిని ప్రారంభించి, ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ సమాచారం అందించేందుకు జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

**ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు:**
జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఉద్యానవన శాఖ అమలు చేస్తున్న పథకాలు, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను వివరించారు. తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలని సూచించారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్, మల్చింగ్, పందిళ్లు, నాణ్యమైన నారు వంటి సదుపాయాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని ముందస్తు మార్కెటింగ్ ప్రణాళికతో సాగు చేయాలని సూచించారు.

**రైతుల తోటలను పరిశీలించిన అధికారులు:**
సదస్సుకు ముందు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, సీఎండీ జితేష్ పాటిల్‌తో కలిసి శేరిపల్లి గ్రామానికి చెందిన రైతులు వీరస్వామి, లక్ష్మయ్య సాగు చేస్తున్న కాకరకాయ, చిక్కుడుకాయ తోటలను పరిశీలించారు. రైతులు ఎకరాకు సుమారు రూ.20 వేల పెట్టుబడితో సాగు చేస్తున్నామని, అనుకూల దిగుబడి వస్తే మూడు నెలల్లో సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన అధికారులు సాగు ఉపకరణాలు, తేనె ఉత్పత్తులు, రైతులకు అందించనున్న కూరగాయల నారును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, గ్రామ సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# హత్య కేసులో భార్య భర్తలకు జీవిత ఖైదు!

మొదటిపేజీ తరువాయి

## - ఐపీసీ 302 కింద జీవిత ఖైదు రూ.10 వేల జరిమానా

## - పోలీస్ అధికారులను అభినందించిన అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 19 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన తోగరి పుష్పమ్మ హత్య కేసులో నిందితులైన ఇద్దరికి నాగర్ కర్నూల్ ప్రిన్సిపల్ డి స్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదున విధించిది. 2016 లో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్ 323/2016 కేసులో విచారణపూర్తిచేసిన న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది.కేసు వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ మండలం పెద్దాపూర్‌కు గ్రామానికి చెందిన తొగరి బుడ్డయ్య (40),అతని భార్య తోగరి సువర్ణ (35)నిందితులుగా ఉన్నారు.వీరిపై ఐ.పీ.సీ 452, 302, 323, 506 సెక్షన్లతో పాటు 34 సెక్షన్ కింద కేసు నమోదైంది.కేసును విచారించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డి.రామకాంత్ నిందితులు నే రం చేసినట్లు నిర్ధారించి ఐపీసీ 302 సెక్షన్ కింద ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా, 452 సెక్షన్ కింద మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా,323 సెక్షన్ కింద ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కే సులో నాటి దర్యాప్తు అధికారులు ఎస్ఐ ఎస్.శేఖ ర్‌రెడ్డి,సీఐ ఎం.రాంబాబు కీలకంగా దర్యాప్తు చేపట్టారు.ప్రస్తుత సీ.ఐ అశోక్‌రెడ్డి,ఎస్.ఐ వెంకట్ రెడ్డి లు కోర్టుకు హాజరయ్యారు.కోర్టు కానిస్టేబుళ్లు ఎస్.గుణశేఖర్,వి.నరేష్,ఎండీ ముజీబ్,కోర్టు లైజనింగ్అధికారి హెచ్.సీ చిన్ని నాయక్ సహకరించారు.ప్రభుత్వ న్యాయవాది ఎం.డీ.అహ్మద్ అలీ, ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. కేసు విషయంలో నిందితులకు శిక్ష పడేలా కృషిచేసిన పోలీస్ అధికారులకు నాగర్ కర్నూల్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రశంసించారు.

# యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 19(ప్రజా జ్యోతి)**

యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలలో ప్రతిభ చాటాలని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచన చేశారు.జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలు,దినపత్రికలు,డిజిటల్ సేవల వినియోగం.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగ నియామకాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులు జిల్లా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని,పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమైన అధ్యాయన వేదికలని,అక్కడ అందుబాటులోఉన్న పుస్తకాలు,దినపత్రికలు,స్టడి మెటీరియల్,డిజిటల్ గ్రంథాలయ సేవలను పూర్తిస్థాయి వినియోగించుకోవాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని కజిల్లా గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పరిస్థితులను స్వయంగా పరిశీలించి,అక్కడచదువుకుంటున్న నిరుద్యోగ యువతీ యువకులతో మాట్లాడి ఏయే ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్నారో,వారి చదువు ప్రణాళిక,రోజూ చదువుకు కేటాయిస్తున్న సమయం, ఎదుర్కొంటున్న ఇబ్బందులు,అందుబాటులో ఉ న్న పుస్తకాలు, ఇతర వసతుల గురించి తెలుసుకుని గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పుస్తకాలను పరిశీలించి ముఖ్యంగా పోటీ పరీక్షలకు అవసరమైన జనరల్ స్టడీస్,జనరల్ నాలెడ్జ్,చరిత్ర,భూగోళశాస్త్రం,భారత రాజ్యాంగం,ఆర్థిక వ్యవస్థ,విజ్ఞానశాస్త్రం,సమకాలీన అంశాలకు పుస్తకాల లభ్యతను పరిశీలించి తెలుగు,ఇంగ్లీష్,హిందీ,ఉర్దూ భాషల్లోని దినపత్రికలను యువత ఏ విధంగా వినియోగిస్తున్న తీరును పరిశీలించి సమకాలీన అంశాలు అన్ని రకాల పోటీ పరీక్షల్లో కీలక పాత్ర పోషిస్తున్నందున ప్రతిరోజూ దినపత్రికలు చదివి రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పత్రికా పఠనాన్ని రోజువారీ చదువులో ఒక భాగంగా చేసుకోవాలని,ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల సన్నద్ధతను మెరుగుపరుచుకోవాలన్నారు.అనంతరం గ్రంథాలయంలోని డిజిటల్ గ్రంథాలయ సదుపాయాలను పరిశీలించి డిజిటల్ వనరులు,ఆన్‌లైన్ అధ్యయన సామగ్రి,పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని యువత ఎలా వినియోగించుకుంటున్నారో తెలుసుకుని,పుస్తకాలతోపాటు డిజిటల్ వనరుల ఉపయోగం ద్వారా జ్ఞానాన్ని మరింత విస్తరించుకోవచ్చని సామాజిక మాధ్యమాల్లో సమయం వృథా చేయకుండా సాంకేతికతను లక్ష్యసాధనకు వినియోగించుకోవాలని,పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకోవాలని ఓ నిర్దిష్ట ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకుని సంబంధిత పరీక్ష సిలబస్,పరీక్ష విధానం,గత ప్రశ్నపత్రాల్ని పూర్తిగాఅధ్యయనం చేయాలని,ప్రతిరోజూ పునశ్చరణకు సమయం కేటాయించడంతో పాటు,వారానికి ఒకసారి తమప్రగతిని స్వయంగా సమీక్షించుకోవాలని ఉద్యోగ నియామక పరీక్షల్లో విజయం సాధించాలంటే కేవలం పుస్తకాలు చదవడం మాత్రమే కాక క్రమ శిక్షణతో కూడిన సాధన అవసరమని,నిర్ణీతసమయపట్టికను రూపొందించి దానికనుగుణంగా చదువుకోవాలని,మాక్ టెస్టులు రాయడం,గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం,నేర్చుకున్న అంశా లను పునశ్చరణ చేసుకోవడం ద్వారా పరీక్షలపై మరింత పట్టు సాధించవచ్చన్నారు.గ్రంథాలయంలో చరిత్రకు సంబంధించిన 18,108 పుస్తకాలు, తెలుగులో 9,768 పుస్తకాలు,ఆంగ్లంలో 3,632 పుస్తకాలు,హిందీలో 2,874 పుస్తకాలు,ఉర్దూలో 1,726 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఉద్యోగనియామక నోటిఫికేషన్లకు అనుగుణంగా, పోటీ పరీక్షలకు అవసరమైన 2,907 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయంలో పుస్తకాల నిల్వలు,పఠన సదుపాయాలు,దినపత్రిల లభ్యత,యువతకు అవసరమైన పుస్తకాలు,సమాచార వనరులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి యువతీ యువకుడిలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని,దాన్ని సరైన దిశలో వినియోగించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని,ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో






కష్టపడుతున్న యువతకు గ్రంథాలయం ఒ మంచి అధ్యయన కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి,గ్రంథాలయ సెక్రటరీ వెంకటయ్య, సంస్థ కార్యదర్శి ఎం.ప్రతాప్,లైబ్రరీయన్ ఆర్.పరమేశ్వరి, గ్రంథాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కృష్ణా నదిలో దూకిన యువతికి ప్రాణదానం

**గద్వాల,ఆగస్టు 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బీచుపల్లి వద్ద కృష్ణా నదిలో ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది.కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన యువతి కృష్ణా నదిలోకి దూకింది.విషయం తెలుసుకున్న స్థానిక గజ ఈతగాళ్లు వెంటనే నదిలోకి దిగి యువతి కోసం గాలింపు చేపట్టి,ఆమెను గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.సమాచారం అందుకున్న ఇటిక్యాల ఎస్సై రవి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.అనంతరం యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించి,ఆమెకు ధైర్యం చెప్పారు.సకాలంలో స్పందించి యువతి ప్రాణాలను కాపాడిన గజ ఈతగాళ్లను,ఎస్సై రవిని స్థానికులు అభినందించారు.కుటుంబ సమస్యలు లేదా ఇతర ఇబ్బందులతో మనస్తాపానికి గురైన వారు ఆత్మహత్యకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు,స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించాలని పోలీసులు సూచించారు.



# హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

## - బీజేపీ నాయకులు

## - మంత్రి సొంత మండలానికే సౌకర్యాలు కరువు..

## -కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ నేతల ధ్వజం

**చిన్నంబావి,ఆగస్టు 19 (ప్రజాజ్యోతి)**

ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్నమల్లయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. మాటలు చెప్పడంలో ఉన్న శ్రద్ధ.. హామీలను అమలు చేయడంలో కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలో బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయంగా విరుచుకుపడ్డారు.హామీలతో అధికారం.. అమలులో ముఖం చాటేస్తున్నారు.బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్నమల్లయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఒక్కొక్కటిగా పక్కన పెడుతోందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, వికలాంగులకు రూ.6 వేలు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెంచిన పింఛన్లు, రైతుబంధు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్లు ఇస్తామని ప్రకటించి అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముందుగా అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో బీజేపీ ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.మంత్రి సొంత మండలానికే దిక్కులేదు.జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత మండలమైన చిన్నంబావిలోనే అభివృద్ధి కనిపించకపోవడం కాంగ్రెస్ పాలనకు అద్దం పడుతోందన్నారు. ఏళ్లుగా మంత్రి రాజకీయాల్లో కొనసాగుతున్నా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు."మంత్రి సొంత మండలంలోనే ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు లేవు.. ప్రజలకు సరైన వైద్యం లేదు.. కనీస మౌలిక వసతులు లేవు. మరి అభివృద్ధి ఎక్కడ జరిగింది?" అని ప్రశ్నించారు.చిన్నంబావిలో ప్రభుత్వ ఆసుపత్రి లేక ప్రజలు వైద్యం కోసం 25 నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. శ్రీశైలం ముంపు ప్రాంతాలు కావడంతో పాములు, విషపురుగుల బెడద ఉన్నప్పటికీ అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. వెంటనే చిన్నంబావిలో ప్రాథమిక ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.నీళ్లు సమృద్ధిగా ఉన్నా.. రైతులకు కరువు కృష్ణానది, రిజర్వాయర్లు సమీపంలో ఉన్నా రైతులకు సాగునీరు అందకపోవడం పాలకుల వైఫల్యమేనని శ్రీధర్‌రెడ్డి అన్నారు. గోపాల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. చిన్నమారు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పునరుద్ధరించి రైతులకు నీరు అందించాలని కోరారు.లిఫ్ట్ ఇరిగేషన్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అవుతున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన పథకాలు నిరుపయోగంగా మారుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.ప్రజా సమస్యలపై పోరుబాట: బొగ్గు కురుమయ్య బీజేపీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ.. చిన్నంబావి ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని





దేవాదాయ శాఖకు చెందిన 84 ఎకరాల భూమిని వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. భూమికి ప్రహరీ నిర్మించాలని, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్, వ్యవసాయశాఖ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు.శ్రీశైలం నిర్వాసితులకు 98 జీవో ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కూడా విఫలమయ్యారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దేవాదాయ భూముల సమస్యపై మూడు, నాలుగు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్ష చేపడతామని బొగ్గు కురుమయ్య హెచ్చరించారు. రైతులకు సాగునీరు అందించకపోతే రైతులను సమీకరించి ధర్నాలు, ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.అధికారం శాశ్వతం కాదు.. ప్రజలే తేల్చుతారు కేవలం అధికారంలో ఉండటమే పాలన కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించడమే నిజమైన పాలన అని బీజేపీ నేతలు అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడితే రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం తప్పదని హెచ్చరించారు.మంత్రి సొంత మండలమైన చిన్నంబావిలోనే ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య సదుపాయాలు, సాగునీరు వంటి కనీస అవసరాలు లేకపోతే కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిన్నంబావి మండల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే గ్రామగ్రామాన ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మేకల చెన్నయ్య యాదవ్, కావలి గోపాల్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జింకల కిరణ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్దకల్ జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థుల సమస్యపై తక్షణ విచారణ చేపట్టాలి

**మల్దకల్ ఆగస్టు 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ హైస్కూల్ లో చదువుతున్న కొంతమంది విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరుకాకుండా చెడు వ్యసనాలకు,చెడు తిరుగుళ్లకు అలవాటు పడుతున్నారనే ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని పీ డి ఎస్ యు మల్దకల్ మండల అధ్యక్షుడు ప్రభువరుణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కొంతమంది విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రుల మాటలను సైతం లెక్కచేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి విద్యార్థులు చెడు వ్యసనాలకు ఎలా గురవుతున్నారు, పాఠశాలకు ఎందుకు సక్రమంగా హాజరు కావడం లేదనే అంశాలను పరిశీలించాలని కోరారు.విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి,వారి భవిష్యత్తును కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే చెడు వ్యసనాలను అరికట్టి,ఈ వ్యవహారంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభువరుణ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యు మల్దకల్ మండల కార్యదర్శి రాజు,నాని పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని బుధవారం నారాయణపేట పట్టణంలో ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఫోటోగ్రాఫర్ పితామహుడు చార్లెస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో మరియు గ్రాఫర్ సంఘం ఆదేశానుసారం జండా ఆవిష్కరించడం జరిగింది, అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ యూనియన్ అధ్యక్షుడు రాజేష్ ఘూట్ మాట్లాడుతూ.. కాలగర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది ఫోటో మాత్రమే అని అన్నారు. మధుర జ్ఞాపకాలను, ప్రకృతి అందాలను, సమాజంలోని మార్పులనను తన కెమెరాతో బంధించేది ఫోటో గ్రాఫర్లని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి, వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శ వినోద్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు రాము సోలాపూర్, లిఖి రఘు బాబు, బస్వరాజ్, నాగరాజ్, మనోహార్, శివ శారీ, బండి నాగరాజ్, పుండన్, నందు, రాజు అరవింద్, మోహన్, భాను, స్టిల్ రాజు, స్థానిక ఫోటో & వీడియోగ్రాఫర్లు కలిసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



# ఓటర్ల ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ-2026 కార్యక్రమంలో భాగంగా ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ అదనపు కలెక్టర్, 75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ ఆర్ ఓ జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ, 2026 ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించినట్లు తెలిపారు. జాబితాలో 'నో మ్యాపింగ్' 'డిస్క్రిపెన్సీస్' కేటగిరీల్లో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్2026 మార్గదర్శకాల ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఓటర్లు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు పరిశీలించి పరిష్కరించనున్నట్లు వివరించారు. ఓటర్లు ముసాయిదా ఓటర్ల జాబితాను తప్పనిసరిగా పరిశీలించి, తమ పేరు లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత గడువులో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసుకోవాలని ఈ ఆర్ ఓ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ఎస్ఐ ఆర్2026 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్చర్ల, మిడ్జిల్, రాజాపూర్, బాలానగర్ మండలాల తహసీల్దార్లు/ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ సహాయ అధికారులు, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల, నవాబ్‌పేట మండలాల డీటీలు, 75జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల డీటీతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# భూత్పూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

భూత్పూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పనితీరును పరిశీలించిన సీఎండీ.. సబ్‌స్టేషన్‌పై ఉన్న విద్యుత్ లోడ్, ప్రస్తుతం కొనసాగుతున్న విద్యుత్ సరఫరా పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ నుంచి ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది, ఆయా ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయాలు, వోల్టేజీ సమస్యలు ఉన్నాయా అనే వివరాలను తెలుసుకున్నారు.విద్యుత్ వినియోగం, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎండీ అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ సరఫరా పరిస్థితులు, సాంకేతిక సమస్యలు, లోడ్ వివరాలను అధికారులు సీఎండీకి వివరించారు. ఈ తనిఖీలో టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ భీమానాయక్, డీఈ చంద్ర మౌళి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి, ఏవో

## - చిన్నంబావి మండల వివిధ గ్రామాల రైతులు

## ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

**చిన్నంబావి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)**

ఆరుతడి పంటల సాగుతో తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించడంతోపాటు మంచి ఆదాయం పొందవచ్చని వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి మేఘన రైతులకు సూచించారు. చిన్నంబావి మండలంలోని అయ్యవారిపల్లి, చెల్లెపాడు, వెల్లటూరు గ్రామాల్లో రైతులకు ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూరాల, భీమా నీటిని ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.మినుముల్లో వీబీఎన్8 రకాన్ని సాగు చేస్తే 70 నుంచి 80 రోజుల్లో పంట చేతికి వస్తుందని, ఎకరాకు 7 నుంచి 9 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చని తెలిపారు. వేరుశనగలో కే6, వశిష్ట రకాలను సాగు చేయాలని సూచించారు. ఈ రకాలు సుమారు 110 రోజుల్లో కోతకు వస్తాయని, ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు.తక్కువ నీటితో దీర్ఘకాలికంగా ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు. ఆయిల్‌పామ్ తోటల ద్వారా 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు రాయితీలు అందిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా మిరప, టమాట, బెండకాయ తదితర కూరగాయల సాగును చేపట్టి రైతులు అదనపు ఆదాయం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి మేఘనతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# చిన్నంబావిలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**చిన్నంబావి, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి)**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నంబావి మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గోపి నాయుడు మాట్లాడుతూ.. సమాజంలో జరిగే విభిన్న సంఘటనలను, మధుర జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించే మహత్తర శక్తి ఫొటోగ్రఫీకి ఉందన్నారు. ప్రతి సంఘటనను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు పాల్గొని ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల సంఘం ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు నాయుడు రఫీ పాల్గొన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ల సేవలను గుర్తుచేసుకున్నారు. సంఘం సలహాదారులు చంద్రశేఖర్ యాదవ్, పోతుగంటి విష్ణు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



# హాస్టల్ విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమర్ధవంతంగా పనిచేయాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

హాస్టల్ విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్‌సీఓలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, డీఈఓ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, హాస్టల్ వార్డెన్లతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో పెండింగ్ పనులు, విద్యార్థుల సంక్షేమం, పరిశుభ్రత, పారిశుధ్యం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి విద్య కోసం వచ్చే విద్యార్థులకు “ఇల్లు దూరమైనా.. ఇంటి వాతావరణం” కల్పించే విధంగా హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన వసతి, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్య సంరక్షణ, మెరుగైన విద్యా సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

హాస్టల్ భవనాలు, గదులు, విద్యుత్, ఫర్నిచర్, మరుగుదొడ్లు, తాగునీరు, వంటశాల తదితర మౌలిక వసతులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. అవసరమైన చిన్న, పెద్ద మరమ్మతులను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**విద్యార్థుల విద్యా పురోగతిపై ప్రత్యేక దృష్టి:**

ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, బెడ్డింగ్, ట్రంక్ బాక్సులు, ప్లేట్లు, గ్లాసులు తదితర సామగ్రిని విద్యార్థులకు సకాలంలో అందించాలని అన్నారు. పంపిణీలో ఎలాంటి కొరత లేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, పరీక్షల ఫలితాలు, మార్కుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. రాత్రి సమయంలో అవసరమైన కోచింగ్ అందించడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి వారి విద్యా సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు.

**నాణ్యమైన భోజనం అందించాలి:**

హాస్టళ్లలో నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన, తాజా భోజనం అందేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. మెస్ కమిటీని ఏర్పాటు చేసి, మెనూను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. వంటకు అవసరమైన సరుకుల జారీ, స్టాక్ నిర్వహణ, భోజన నాణ్యతను అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ కార్డులు, క్రమం తప్పని వైద్య పరీక్షలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులను సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్య కేంద్రానికి తీసుకెళ్లి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు, స్టాక్, నగదు, బిల్లులు, సందర్శకులు, మూవ్‌మెంట్, ఫిర్యాదులు తదితర అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి పారదర్శకత పాటించాలని అన్నారు. తనిఖీ అధికారుల సూచనలను రికార్డు చేసి, వాటిపై తీసుకున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యం:**

హాస్టల్ లోపలితో పాటు హాస్టల్ చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పిచ్చి మొక్కలు, పొదలు, ఎండిపోయిన లేదా పనికిరాని చెట్లు, చెత్తాచెదారం లేకుండా ప్రతిరోజూ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పెరిగిన పొదలు, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు, ఎండిపోయిన చెట్లను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా శుభ్రంగా ఉంచడంతో పాటు డ్రైనేజీల్లో చెత్త, మట్టి, మురుగు పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని అన్నారు. ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. హాస్టల్ భవనాలు, గదులు, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి ప్రదేశాలు, పరిసరాలతో పాటు 100 మీటర్ల చుట్టుపక్కల ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. దోమలు, ఈగలు, ఇతర కీటకాలు పెరగకుండా అవసరమైన ఫాగింగ్, యాంటీ లార్వా, ఇతర పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా, మురుగునీరు నిల్వ లేకుండా, పొదలు, వృథ చెట్లు లేకుండా



ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

**తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి:**

విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి త్రైమాసికం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, ప్రవర్తన, సంక్షేమంపై తల్లిదండ్రులతో చర్చించాలని అన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ఈపాస్, ఈ – హాస్టల్ వంటి ఆన్‌లైన్ వ్యవస్థల్లో విద్యార్థుల వివరాలు, హాజరు, స్టాక్, బిల్లులు తదితర సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన విద్యార్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా పురోగతి, సమగ్ర సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రతి హాస్టల్ వెల్ఫేర్ అధికారి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, మానవతా దృక్పథంతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

# గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

## క్రైమ్ సీన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ జానకి







**మహబూబ్‌నగర్, ఆగస్టు 19**

**( ప్రజా జ్యోతి బ్యూరో ):**

రాజాపూర్ మండలం రంగారెడ్డి గూడ గ్రామ సమీపంలోని ఎస్.పీ. పెట్రోల్ పంపు వద్ద ఎన్హెచ్ –44 రహదారి పక్కన సుమారు 3540 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది.సమాచారం అందుకున్న మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి సంఘటనా స్థలానికి చేరుకుని క్రైమ్ సీన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహం లభించిన పరిస్థితులు, సంఘటనా స్థలంలో ఉన్న ఆధారాలు, పరిసర ప్రాంతాలకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, మృతురాలి గుర్తింపును వీలైనంత త్వరగా నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.మృతురాలిని ఎవరైనా గుర్తించినా, ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఆమెకు సంబంధించిన ఏదైనా సమాచారం ఎవరికైనా తెలిసినా వెంటనే రాజాపూర్ పోలీసులను సంప్రదించాలని జిల్లా పోలీసులు కోరారు. సంప్రదించవలసిన నంబర్లు:ఎస్సై, రాజాపూర్: 8712659347రాజాపూర్ పోలీస్ స్టేషన్: 8712665216 సి ఐ, జడ్చర్ల రూరల్: 8712659315సంఘటనా స్థల పరిశీలనలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ మహేష్, రాజాపూర్ ఎస్ఐ రాజశేఖర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ ఫోరం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుంది : జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్ నగర్ ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

సీనియర్ సిటిజన్ ఫోరం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తూ ముందుకు సాగుతోందని జిల్లా ఎస్పీ దరావత్ జానకి కొనియాడారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలు, మోసాలపై నిర్వహించిన అవగాహన సదస్సు అనంతరం స్థానిక సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు ఎస్పీ జానకిని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజం పట్ల సీనియర్ సిటిజన్లకు అనేక కీలక బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు.తమ జీవితకాల అనుభవం, విజ్ఞానం, విలువలతో యువతకు సరైన మార్గనిర్దేశం చేయడంలో సీనియర్ సిటిజన్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు సమాజంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు వారు చురుకైన పాత్ర పోషించవచ్చని అన్నారు. ముఖ్యంగా మైనర్లు గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. యువత భవిష్యత్తు సక్రమమైన మార్గంలో సాగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ఉపాధ్యక్షుడు రాజసింహుడు, కె.వి. అశోక్, సూర్యనారాయణ, సురేష్ బాబు, లలితమ్మ, రియాజోద్దీన్, పోకల శివుడు, రాములు, అబ్దుల్ మన్నాన్, బాలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## - అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలి

## -కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలతో) ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2002 ఓటరు జాబితా ఆధారంగా మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వం జారీ చేసిన 11 రకాల అధికారిక ధ్రువపత్రాల్లో సంబంధిత ఆధారాలను స్వీకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై ఆయన అధికారులకు వివరించారు.నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 910 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. 2002 ఓటరు జాబితా ఆధారంగా మ్యాపింగ్ కాని ఓటర్లు 13,216 మంది ఉన్నారని పేర్కొన్నారు. అలాగే పేర్లు, తల్లిదండ్రుల పేర్లు తదితర వివరాల్లో తేడాలు ఉన్న అనామలీస్ జాబితాలో 1,02,635 మంది ఉన్నారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రత్యేకంగా సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్మాట్లాడుతూడడ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల జాబితాలో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని, ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు,వివరాల్లోని వ్యత్యాసాలు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు,వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై, పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు.ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపట్టాలన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని సూచించారు. మ్యాపింగ్, నోటీసుల జారీ, క్లెయిమ్‌లుఅభ్యంతరాల పరిష్కారం వంటి ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ,నిర్ణీత కాలపరిమితిలో ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.2002 ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని వారు, అనామలీస్ జాబితాలో ఉన్న వారికి నోటీసులు జారీ చేసి, వారు సమర్పించే భారత ఎన్నికల సంఘం ధ్రువీకరించిన 11 రకాల ప్రభుత్వ ధ్రువపత్రాలను పరిశీలించాలని సూచించారు. సంబంధిత ఆధారాల ఆధారంగా ఆన్‌లైన్ జనరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే రాజకీయ పార్టీల ప్రతినిధుల సహాయ సహకారాలను తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి చేన్నయ్య, ఆర్డీవోలు తాహసిల్దార్లు తదితరులు హాజరయ్యారుడ



# పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కార్యదర్శుల సస్పెన్షన్

## - ఎత్తం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 19 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి)**

గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ చర్యలు చేపట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం ఎత్తం, ఎర్రన్నబావి తాండ గ్రామపంచాయతీలకు చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే వ్యవహారంలో ఎత్తం గ్రామపంచాయతీ సర్పంచ్ బి. లక్ష్మి, ఉపసర్పంచ్ బి. ధర్మరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఎత్తం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌తో పాటు, గతంలో ఎత్తం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ప్రస్తుతం ఎర్రన్నబావి తాండ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి. నరసింహాను సస్పెండ్ చేశారు.ఎత్తం గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన గ్రామపంచాయతీ అభివృద్ధి నిధుల వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. నిధుల వినియోగం, అభివృద్ధి పనుల అమలు, బిల్లులు, చెల్లింపులు తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు.గ్రామపంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులను ప్రజల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం నిబంధనల ప్రకారం వినియోగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎత్తం గ్రామపంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన



రికార్డులు, బిల్లులు, చెల్లింపుల వివరాలు, అభివృద్ధి పనుల అమలు తదితర అంశాలపై నివేదికల ఆధారంగా చర్యలు కొనసాగుతున్నట్లు విచారణలో నిధుల వినియోగంలో నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. వెల్లడించారు.

# సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

## అప్రమత్తంగా ఉండాలి.. ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పొద్దు : డీఎస్పీ వెంకటేశ్వర్లు






**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచనలతో బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మోసాలు, అనుమానాస్పద లింకులు, జాబ్ ఫ్రాడ్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు తదితర సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మార్గాలను అనుసరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ మోసాలపై సీనియర్ సిటిజన్లకు విస్తృతంగా అవగాహన కల్పించారు. వివిధ సైబర్ నేరాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తూ నేరగాళ్లు ఏ విధంగా మోసాలకు పాల్పడుతున్నారో వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్లతో సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండేలా ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రవి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిటైర్డ్ పోలీస్ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ అదనపు ఎస్పీ చిలుకల రాజయ్య, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జగపతిరావు, ఇతర పోలీసు సిబ్బంది, సుమారు 300 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

# నర్వ మండల కేద్రానికి నవోదయ పాఠశాల విషయంలో డీకే.అరుణమ్మ జోక్యం కలిగించుకోలేదు

## అసలు మీ నివేదిక ఎవరికిచ్చారు చూపండి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంతారెడ్డి

**నరు ఆగస్టు 19 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండలానికి నవోదయ పాఠశాల మంజూరు పై అరుణమ్మ రాజకీయం చేస్తుంది అని ఓ రాష్ట్ర మంత్రి అనడం హర్షస్వదంగా ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి, బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు, బుధవారం ప్రజా జ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన నర్వకు నవోదయ పాఠశాల మంజూరు పై అడ్డుకున్నారు అనే వార్తను స్పందించిన బంగ్లా లక్ష్మి కాంతారెడ్డి , కౌంటర్ గా బుధవారం ఓ ప్రకటనలో ఆయన తెలుపుతూ మాట్లాడారు , తెలంగాణ రాష్ట్ర క్రీడాలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పై మండిపడ్డారు, ఈ సందర్భంగా ఆయన ప్రజా జ్యోతి విలేకరితో మాట్లాడుతూ ఈ విధంగా వివరించారునర్వ మండల కేంద్రంలో నిన్న జరిగిన మంత్రి గారి పర్యటనలో భాగంగా ప్రాథమిక వ్యవసాయ క్షేత్రంలో మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గారు మాట్లాడుతూ నేను బీజేపీ పెద్దలను కలిసి నర్వ మండల కేంద్రానికి నవోదయ పాఠశాలను మంజూరు చేయాలనీ కోరితే, పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణమ్మ అడ్డుపడుతున్నారు అని మాట్లాడటం మంత్రి గారి చేతగాని తనానికి, అపరిపక్వ రాజకీయ పరిణతికి అద్దం పడుతుందని బీజేపీ నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి గారు మండి పడ్డారు, మంత్రిగారు మీరు నవోదయ పాఠశాల గురించి ఏ బీజేపీ నాయకులతో మాట్లాడితే అరుణమ్మ అడ్డుపడ్డదో వివరాలు తెలుపగలవా, ఒకవేళ అరుణమ్మ అడ్డుపడినట్లు ఆధారాలు చుపివ్వగలవా,నర్వ మండల ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించకు మంత్రి కేంద్రప్రభుత్వ నిధులతో మంజూరైన పనులను అరుణమ్మకి ఏమాత్రం ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూమి పూజలు చేసే మీరా అరుణమ్మ గురించి మాట్లాడేది.దివంగత శ్రీ చిట్టెం నర్సిరెడ్డి దగ్గర రాజకీయ ఓనమాలు నేర్చిన మీరు, మక్తల్ సర్పంచ్ గా, జడ్పీటీసీగా చిట్టెం కుటుంబ సభ్యులు మరియు అరుణమ్మ ఆశీస్సులతో గెలిచి గొప్పలు చెప్పుకొన్న శ్రీహరి గారు, భీమా ప్రాజెక్టు ద్వారా మక్తల్ నియోజక వర్గానికి సాగునీటిని అందించి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గా ఉండి, మావోయిస్టుల తూటాలకు ప్రాణాలొదిలిన స్వర్గీయ శ్రీ చిట్టెం నర్సిరెడ్డి , జయంతి, వర్ధంతి సందర్భముగా కనీసం తన విగ్రహానికి ఒక పూలమాల వేయని మీరు నర్సిరెడ్డి గారి కూతురు, మహబూబ్నగర్ ఎంపి అరుణమ్మ గారు నాకు అడ్డుపడుతుందని మాట్లాడటం మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం.నర్వ సింగిల్ విండొని ప్రక్షాళన చేస్తా, రైతులకు న్యాయం చేస్తా అని మీ ఎన్నికల ముందు వాగ్దానం చేసి,ఎమ్మెల్యే గా గెలిచిన తరువాత మొట్టమొదటి జనరల్ బాడీ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్తో మాట్లాడినా, 15 రోజులల్లో లెక్కలన్నీ బయట పెడ్తా అన్న మీరు, ఎమ్మెల్యే గా రెండు సంవత్సరాలు, మంత్రిగా అయి ఒక సంవత్సరం గడుస్తున్నా ఈరోజు వరకు సింగిల్ విండో గురించి పట్టించుకోని శ్రీహరి గారు, మీరా నర్వ పిఎసిఎస ని రోల్ మాడల్ గా తీర్చి దిద్దేది.మీరు నిజంగా సమావేశాల్లో మాట్లాడాల్సింది మీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల



గురించి మాట్లాడి ఎన్ని నెరవేర్చారో తెలపండి అని అన్నారు

# వరికి ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలి

- బిందు సేద్యం, ఫెర్టిగేషన్‌తో కూరగాయలు ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం
- రైతులను అభినందించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నాగర్ కర్నూల్ ఆగస్టు 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

తాడూరు, బిజినేపల్లి మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కే. సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో పంట మార్పిడి లో భాగంగా , వరి మొక్కజొన్న వంటి సాంప్రదాయ పంటల నుండి లాభదాయకమైన కూరగాయలు పామాయిల్ తోటలు పప్పు దినుసులు సాగు చేస్తున్న రైతుల పొలాలను పరిశీలించారు. సంప్రదాయ వరి, మొక్కజొన్న పంటల సాగుకు ప్రత్యామ్నాయంగా లాభదాయకమైన పంటలను సాగు చేస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని సాధిస్తున్న రైతుల పొలాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కే. సురేంద్ర మోహన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ పరిశీలించారు.

**రైతులను అభినందించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,**

నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులు బిందు సేద్యం, ఫెర్టిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తూ లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్న తీరును రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కే. సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అభినందించారు. రైతులు అనుసరిస్తున్న ఆధునిక యాజమాన్య పద్ధతులు, సాధిస్తున్న దిగుబడులు, పొందుతున్న ఆదాయంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో వీడియో కాల్ ద్వారా రైతులను నేరుగా మాట్లాడించారు. బిజినేపల్లి, తాడూరు మండలాలకు చెందిన రైతులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేరుగా మాట్లాడి, వారు చేపడుతున్న ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలు, బిందు సేద్యం వినియోగం, పంటల దిగుబడి, ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న వంటి సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి లాభదాయక పంటలను ఎంచుకుని, ఆధునిక సాగు పద్ధతులను పాటిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్న రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేలా బిందు సేద్యాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని, రైతులు తమ భూమి, నీటి వనరులు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా లాభదాయకమైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు తమ అనుభవాలను మంత్రితో పంచుకున్నారు. బిందు సేద్యం, ఫెర్టిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్, అంతర పంటల సాగు, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి పద్ధతుల ద్వారా సాధిస్తున్న ప్రయోజనాలను వివరించారు. రైతులు స్వయంగా అవలంబిస్తున్న ఈ విధానాలు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. జిల్లాలో రైతులు చేపడుతున్న ప్రత్యామ్నాయ, లాభదాయక పంటల సాగును రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా గుర్తించి అభినందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో మంత్రితో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం తమకు మరింత ప్రోత్సాహాన్ని అందించిందని రైతులు తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినేపల్లి, తాడూరు మండలాల్లో పర్యటించిన వారు రైతులు చేపడుతున్న ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా బిందు సేద్యం, ఫెర్టిగేషన్, ప్లాస్టిక్ మల్చింగ్, స్టేకింగ్, ట్రెలీసింగ్, అంతర పంటల సాగు, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి పద్ధతులను రైతులు ఏ విధంగా అమలు చేస్తున్నారో అనే విషయాన్ని రైతుల పంట పొలాలను సందర్శించి తెలుసుకున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో నీటి లభ్యత, నేల స్వభావం, స్థానిక వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని వ్యవసాయ తెలంగాణలోనూ వరి ఆధారిత సాగు నుంచి ప్రాంతానుకూల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని వారు తెలిపారు.బిజినేపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు పి. మాధవరెడ్డి మూడు ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగు చేపట్టారు. ఇందులో ప్రధానంగా టమాటా, వంకాయ, పచ్చిమిర్చి పంటలను సాగు చేస్తున్నారు.పంట సాగులో రైతు ఆధునిక యాజమాన్య పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తక్కువ నీటితో పంటకు అవసరమైన తేమను అందించేందుకు బిందు సేద్యంను వినియోగిస్తున్నారు. అదే సమయంలో నీటితో పాటు మొక్కలకు అవసరమైన పోషకాలను సమర్థవంతంగా అందించేందుకు ఫెర్టిగేషన్ పద్ధతిని అనుసరిస్తున్నారు.పంట పొలంలో ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతిని అమలు చేస్తున్నారు. దీని ద్వారా నేలలో తేమను నిలుపుకోవడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే కూరగాయల మొక్కలకు అవసరమైన ఆధారాన్ని కల్పించేందుకు స్టేకింగ్, ట్రెలీసింగ్ పద్ధతులను పాటిస్తున్నారు. మొక్కల పెరుగుదలను క్రమబద్ధీకరించడం, కాయలు నేలను తాకకుండా చూడటం, పంట నాణ్యతను మెరుగుపరచడం వంటి ప్రయోజనాలు ఈ విధానాల ద్వారా పొందుతున్నట్లు రైతు వివరించారు. మొక్కలను ఒకేసారి కాకుండా క్రమపద్ధతిలో నాటే స్టాగర్డ్ ప్లాంటింగ్ మెథడాలజీని కూడా రైతు అనుసరిస్తున్నారు. ఆధునిక పద్ధతుల సమన్వయంతో కూరగాయల సాగును నిర్వహిస్తున్న మాధవరెడ్డి పొలాన్ని అధికారులు పరిశీలించి సాగు విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో సూక్ష్మ సేద్యం ద్వారా నీరు, ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, కూరగాయలు, పూలు, ఆయిల్‌పామ్ వంటి పంటల్లో ఉత్పాదకతను పెంచడం లక్ష్యంగా మైక్రో ఇరిగేషన్ కార్యక్రమాలు అమలవుతున్నాయిని సురేంద్రమోహన్ తెలిపారు. తాడూరు మండలం చెర్ల ఇటిక్యాల గ్రామానికి చెందిన రైతు రాజేందర్‌రెడ్డి 3.5 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ తోటను సాగు చేస్తున్నారు. తోట నిర్వహణలో బిందు సేద్యాన్ని వినియోగిస్తూ నీటి వినియోగాన్ని నియంత్రిస్తున్నారు.
రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను సమన్వయం చేస్తూ పంటకు పోషకాలను అందిస్తున్నారు. ముఖ్యంగా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందేందుకు ఆయిల్‌పామ్ తోటలో పెసర, మినుము వంటి అంతర పంటలను



సాగు చేస్తున్నారు.రాజేందర్‌రెడ్డికి సొంత డెయిరీ ఫార్మ్ ఉండటంతో అక్కడ లభించే ఆవుపేడ, ఆవుమూత్రాన్ని కూడా తోటలో వినియోగిస్తున్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రతి ఆయిల్‌పామ్ చెట్టుకు వీటిని అందిస్తున్నట్లు రైతు తెలిపారు.రసాయన ఎరువుల వినియోగంతో పాటు సేంద్రియ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం వల్ల తోటలో నేల ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు.రాజేందర్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో 33 నెలల వయస్సులోనే ఎకరానికి సుమారు 4.5 టన్నుల దిగుబడి సాధిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఎకరానికి సుమారు రూ.లక్ష నికర ఆదాయం పొందుతున్నట్లు వివరించారు.బిజినేపల్లి మండలం జమిస్తాపూర్ గ్రామానికి చెందిన రైతు మన్నెపు రెడ్డి పంటల వైవిధ్యీకరణలో భాగంగా భారీ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారు.గతంలో ఆయన ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలను సాగు చేసేవారు. అయితే సంప్రదాయ పంటల సాగుతో పాటు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించిన అనంతరం ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లారు.ఇందులో భాగంగా 25 ఎకరాల విస్తీర్ణంలో 2026 జూలైలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని పొందాలనే ఉద్దేశంతో పంట మార్పిడిలో భాగంగా ఆయిల్‌పామ్ తోటను ఏర్పాటు చేసినట్లు రైతు తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల ప్రారంభ దశలో అంతర పంటలను సాగు చేసుకోవడం ద్వారా ప్రధాన పంట దిగుబడికి వచ్చే వరకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని ఉద్యానశాఖ సూచిస్తోంది. ప్రిన్సిపల్ సెక్రెటరీ కే. సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రైతులతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు.పంట సాగుకు అయ్యే పెట్టుబడి, నీటి వినియోగం, ఎరువుల వినియోగ విధానం, కూలీల అవసరం, పంట దిగుబడి, మార్కెట్ పరిస్థితులు, రైతుకు లభిస్తున్న ఆదాయం వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతులు తమకు అనుకూలంగా ఉన్న పంటలను ఎంపిక చేసుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను నియంత్రించడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవచ్చని సూచించారు. వెంకటాపూర్‌లో మాధవరెడ్డి కూరగాయల సాగు, చెర్ల ఇటిక్యాలలో రాజేందర్‌రెడ్డి ఆయిల్‌పామ్ సాగు, జమిస్తాపూర్‌లో మన్నెపు రెడ్డి చేపట్టిన 25 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులను రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి సన్మానించారు. వారి వెంట జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, హార్టికల్చర్ అధికారి వెంకటేశం, డివిజన్ అగ్రికల్చర్ అధికారి జగన్, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు ఉన్నారు

# మల్దకల్ మండలంలో అపార్,ఆధార్ నమోదు పరిశీలన

## - ఎం బి యు పెండెన్సీ తగ్గింపు,అపార్ జనరేషన్ వేగవంతం చేయాలని అధికారుల సూచన

**మల్దకల్ ఆగస్టు 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో సి ఓ-x, ఏ పి ఓ,టెక్నికల్ పర్సన్ బృందం మల్దకల్ మండలంలో బుధవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంపీపీ ఎస్ మల్దకల్,మిక్కీ టాలెంట్ స్కూల్,దామ గోవిందప్ప ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అపార్,ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు.అలాగే జెడ్ పి పి హెచ్ ఎస్ మల్దకల్‌లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని,ప్లానింగ్ కోఆర్డినేటర్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పి జి ఐ సూచికలు,యుడైస్+ నమోదు, అప్పర్ జనరేషన్,ఎం బి యు పెండెన్సీ,డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అపార్ జనరేషన్‌లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపే ఉద్దేశంతో ఈ పైలట్ ఫీల్డ్ పర్యవేక్షణ చేపట్టారు.ముఖ్యంగా అపార్-రెడీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.దామ గోవిందప్ప యూపీ స్కూల్‌లో 38 మంది విద్యార్థులు అపార్-రెడీగా ఉండగా,వారిలో నలుగురికి అపార్ జనరేషన్ పూర్తయింది.మిగిలిన 34 మంది విద్యార్థులకు బాల ఆధార్ ఉన్నందున వెంటనే ఎంపియు ద్వారా బయోమెట్రిక్ అప్‌డేషన్ చేపట్టాలని అధికారులు సూచించారు.30 మంది విద్యార్థులకు పెన్ నంబర్లు లేవని గుర్తించారు.పాఠశాలలో మొత్తం 91 మంది విద్యార్థుల ఎం బి యు పెండెన్సీ ఉన్నట్లు గుర్తించారు.మిక్కీ టాలెంట్ స్కూల్‌లో 49 మంది విద్యార్థులు అపార్-రెడీగా ఉండగా,23 మందికి అపార్ జనరేషన్ పూర్తయింది. 17 మంది విద్యార్థులకు బాల ఆధార్ ఉన్నందున వారికి తక్షణమే ఎం బి యు ద్వారా బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయాల్సి ఉందని గుర్తించారు.మరో ఎనిమిది మందికి పేరెంట్ కన్సెంట్ అవసరమని తెలిపారు.పాఠశాలలో మొత్తం 66 మంది విద్యార్థుల ఎం బి యు పెండెన్సీ ఉన్నట్లు గుర్తించారు.ఎంపీపీ ఎస్ మల్దకల్‌లో 40 మంది విద్యార్థులు అపార్-రెడీగా ఉండగా,ఆరుగురికి అపార్ జనరేషన్ పూర్తయింది.20 మంది విద్యార్థులకు బాల ఆధార్ ఉన్నందున వారికి వెంటనే బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయాల్సి ఉందని గుర్తించారు.24 రికార్డులకు పెన్ నంబర్లు లేవని గుర్తించగా,మొత్తం 65 మంది విద్యార్థుల ఎం బి యు పెండెన్సీ ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మండలంలోని అన్ని ఎం బి యు పెండింగ్ విద్యార్థులను కేటాయించిన రెండు ఆధార్ కిట్ల ద్వారా కవర్ చేయాలని నిర్ణయించారు.ఇందుకోసం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం ఆర్ సి కి సమాచారం అందించాలని,ఎం ఆర్ సి ఆధార్ కిట్‌తో పాటు ఆపరేటర్‌ను పాఠశాలలకు పంపించాలని సూచించారు.బాల ఆధార్ ఉన్న అపార్-రెడీ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.పెన్ నంబర్లు జనరేట్ కాకపోవడం వంటి సమస్యలను రాష్ట్ర కార్యాలయం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు డ్రాప్‌బాక్స్‌కు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ ప్రణాళిక విభాగం





అధికారులు,మండల కంప్యూటర్ ఆపరేటర్,ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్,ఎస్ ఎన్ ఆర్ ఏజెన్సీ ఆధార్ కిట్ ఆపరేటర్ పాల్గొన్నారు.ఎం బి యు పెండెన్సీని తగ్గించడం,అపార్ జనరేషన్‌ను వేగవంతం చేయడం,పీ జీ ఐ సూచికల్లో మెరుగైన పనితీరు సాధించడమే ఈ క్షేత్ర పర్యవేక్షణ ప్రధాన లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి,జోగులాంబ గద్వాల జిల్లా తెలిపారు.

# వరుణ యాగ కొనసాగింపుగా ఘనంగా పాదయాత్ర

## - 10 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

## - కృష్ణాతుంగభద్ర జలాలతో జులేకల్ శివాలయంలో శివుడికి అభిషేకం

**గద్వాల ఆగస్టు 19(ప్రజా జ్యోతి ప్రతినిధి):**





అలంపూర్ నియోజకవర్గంలో వరుణ దేవుడి కృపతో సమృద్ధిగా వర్షాలు కురిసి,రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం కొనసాగింపుగా నిర్వహించిన పాదయాత్ర ఘనంగా జరిగింది.అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఈశ్వరమ్మ ఆలయం నుంచి జులేకల్ శివాలయం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన వరుణ యాగానికి కొనసాగింపుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంపత్ కుమార్ తెలిపారు.పాదయాత్ర అనంతరం కృష్ణా,తుంగభద్ర నదుల పవిత్ర జలాలతో జులేకల్ శివాలయంలో శివుడికి అభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ,అలంపూర్ నియోజకవర్గం ఏటా పాడి పంటలతో పచ్చగా కళకళలాడాలని,కరువు కాటకాలు ఈ ప్రాంత రైతులను వెంటాడకుండా ఉండాలని ఆకాంక్షించారు.వరుణ దేవుడి కృప ఎల్లప్పుడూ ఈ ప్రాంత ప్రజలపై ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.పాదయాత్ర సందర్భంగా రైతులు,మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతు సంఘాల నాయకులు,మాజీ,ప్రస్తుత సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఏండ్ల బండ్లతో పాటు డప్పు చప్పుళ్లు, ఆటపాటలతో పాదయాత్ర ఉత్సాహభరితంగా కొనసాగింది.అన్ని మండలాల మండల అధ్యక్షులు,జిల్లా నాయకులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

మొదటిపేజీ తరువాయి

నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 19(ప్రజా జ్యోతి)

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు కే. సురేంద్రమోహన్ సమీక్షనాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్.ఐ. ఆర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించాలని,ఓటర్ల జాబితా సవరణలో పొరపాట్లకు తావులే కుండా క్షేత్రస్థాయిలో ప్రతిఅంశాన్ని నిశితంగా పరిశీలించాలనిభారత ఎన్నికల సంఘం నాగర్ కర్నూల్ జిల్లాకు నియమించిన జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి కే.సురేంద్రమో హన్ అధికారులను ఆదేశించారు.బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాను సందర్శించిన ఆయన ముందుగా జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు.అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జిల్లాలో కొనసాగుతున్న ఓటర్లజాబితా ప్రత్యేక సవరణ ప్ర క్రియకు సంబంధించిన అంశాలు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, ఓటర్ల వివరాల పరిశీలన, క్షేత్రస్థాయిలో సేకరిస్తున్న సమాచారం,ఓటర్ల జాబితాకు అభ్యంతరాలు,క్లెయిమ్‌లు తదితర అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులనడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాఎన్నికల అధికారి,కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ జిల్లాలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వివరాలను పరిశీలకుడికి వివరిస్తూ జిల్లాలోని నియోజకవర్గాల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో అధికారుల ద్వారా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలన,రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం ఇతర అంశాలను కలెక్టర్ వివరించారు.ఈ సందర్భంగా కే.సురేంద్రమోహన్ మాట్లాడుతూ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత,నిష్పక్షపాతత్వం,కచ్చితత్వానికి ప్రాధాన్యం ఇస్తూ,అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు కల్పించేలా అధికారులు,రాజకీయ పార్టీ లు సమన్వయంతో ముందుకుసాగుతూ ప్రజలకు ఓటు హక్కు అత్యంత కీలకమైనదని,అర్హత కలిగి న ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికలయంత్రాంగం ప్రధాన బాధ్యత అని ఓటర్ జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిశీలించుకోవా లని,ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని,అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటర్ జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అటవీ ప్రాంతాల్లో నివసించే చెంచు కుటుంబాలను గుర్తించి,ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి వివరాలను సేకరించి, వారి పేర్లు ఓటర్ జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు తం పేర్లను పరిశీలించుకోవాలి:-జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించి న మార్గదర్శకాల ప్రకారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని,ప్రతి దశలోనూ అవసరమైన పర్యవేక్షణ చేపడుతున్నామని, ఓటర్ జాబితా సవరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారుని.రానున్న మూడు రోజుల పాటు ఓటర్ జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లు,చిరునామా,వయస్సు తదితర వివరాలను ఓటర్ జాబితాలో పరిశీలించుకోవాలని వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సవరణలు,మార్పులు,చేర్పులు లేదా తొలగింపులకు సంబంధించిన నిర్ణీత దరఖాస్తులను సమర్పించాలని,అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఓటర్ జాబితా సవరణల ప్రక్రియపై ప్రజలకు పూర్తి అమలకు సైతం ఓటర్ జాబితా సవరణలు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, ఆర్డీవోలు బన్సీలాల్,అర్చన,యాదగిరి,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బాలకృష్ణ, హబీబ్, రాజేందర్,హుస్సేన్,నర్సింహా,విష్ణు,నాగేందర్ గౌడ్ రామకృష్ణ,సూపరిండెంట్ రవికుమార్,డి.టి కల్పన తదితరులు పాల్గొన్నారు.

# రాజి మార్గమే రాజమార్గం!

## -కక్షిదారులు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా న్యాయమూర్తి డి.రమాకాంత్

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం వచ్చే నెలలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పై విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ &చైర్మన్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రమాకాంత్ హాజరై మాట్లాడుతూ జిల్లా లోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో సెప్టెంబర్ 12న, జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ బడుతుందన్నారు.ఈ లోక్ అదాలత్ లో భూతగాదా కేసులు,రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు,కుటుంబ కేసులు, మోటారు వాహనాల ఆక్సిడెంట్ కేసులు,బ్యాంకు కేసులు తదితర పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు.రాజీ మార్గమే రాజమార్గమని లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారంతో అప్పీల్ లేని తీర్పును పొంది సమయం,డబ్బును ఆదా చేసుకోవచ్చని,లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలు సుఖ సంతోషాలతో జీవించవచ్చని, కక్షి దారులు పగలు ప్రతీకారాలు పెంచుకోకుండా ఇరు వర్గాలు రాజీ చేసుకోవడంతో మానవ సంబంధాలు బలపడతాయని అన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరగా పరిష్కరించుకోవడానికి గొప్ప అవకాశమని అ న్నారు.ఈ కార్యక్రమంలో ఏ.శ్రీదేవి సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, శృతి దూత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్, శ్రీనిధి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్,పోలీస్ ఉన్నతాధికారులు, ఎక్సైజ్ అధికారులు,పాత్రికేయులు పాల్గొన్నారు.




# ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన ఆనంద్ కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):

ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నగరంలోని వివిధ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఛాయాచిత్రకారులతో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెమెరా కంటితో సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకువస్తూ, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటోజర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఒక ఛాయాచిత్రం ఎన్నో మాటలకు సమానమని, చరిత్రను కళ్లముందు నిలిపే శక్తి ఛాయాచిత్రానికి ఉందన్నారు. నిత్యం వార్తా సేకరణలో భాగంగా ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలను తమ కెమెరాల్లో బంధించి సమాజానికి చేరవేస్తున్న ఛాయాచిత్రకారులకు ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భాస్కర చారి రవి, మీడియా ప్రతినిధులు, పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్2026 ముసాయిదా ఓటర్ల జాబితాపై యాక్షన్ ప్లాన్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఎస్ఐఆర్ 2026లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం చేపట్టాల్సిన చర్యలు, నోటీసుల జారీ, పెండింగ్ అంశాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్2026 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన చర్యలు, నోటీసుల జారీ, పెండింగ్ అంశాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రక్రియపై చర్చించారు.

**జిల్లాలో 6,29,402 మంది ఓటర్లు:**

ఆగస్టు 17, 2026 నాటికి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 6,29,402 మంది ఓటర్లు ఉన్నట్లు ముసాయిదా జాబితాలో నమోదైంది. ఇందులో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2,13,588 మంది, జడ్చర్లలో 1,99,354 మంది, దేవరకద్రలో 2,16,460 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 3,13,256 మంది పురుషులు, 3,16,107 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉండగా, 20 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు నమోదయ్యారు.

**మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీలపై ప్రత్యేక దృష్టి:**

ముసాయిదా ఓటర్ల జాబితాలో 40,116 మంది ఓటర్లకు నో మ్యాపింగ్ ఉండగా, 1,96,576 లాజికల్ డిస్క్రెపెన్సీలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా మహబూబ్‌నగర్‌లో 19,487, జడ్చర్లలో 8,759, దేవరకద్రలో 11,870 మంది మ్యాపింగ్ పెండింగ్‌లో ఉంది. అదేవిధంగా లాజికల్ డిస్క్రెపెన్సీలు మహబూబ్‌నగర్‌లో 69,951, జడ్చర్లలో 60,961, దేవరకద్రలో 65,664గా నమోదయ్యాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బీఎల్ఓల నియామకం, డేటా అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**బీఎల్ఓల సంఖ్య 862కు పెంపు:**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో గతంలో 846 మంది బీఎల్ఓలు/పీఎస్ సిబ్బంది ఉండగా, కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో ఈ సంఖ్య 862కు చేరింది. బీఎల్ఓలకు శిక్షణ ఇచ్చేందుకు ఈఆర్ఓలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీలు, బీఎల్ఓల అప్‌డేషన్, సమావేశాల మినిట్స్ తదితర పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్డీఓ నవీన్, ఎలక్షన్ డీటీ అధికారి జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ తదితరులు పాల్గొన్నారు.






# మాదిగల అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పోరాడాలి

## బెక్కెం గ్రామంలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీ ఎన్నిక

**చిన్నంబావి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని గ్రామస్థాయి నుంచే బలోపేతం చేయాలని ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి దేవని రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. బెక్కెం గ్రామంలో నూతన కమిటీల ఏర్పాటు అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా బెక్కెం గ్రామంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా దేవని మహేష్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా బండారి ఉమేష్ చంద్ర మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య గ్రామ అధ్యక్షుడిగా సంధ్యాపాగ పవన్ మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య గ్రామ అధ్యక్షురాలిగా బోరెల్లి చంద్రకళ మాదిగ ఎన్నికయ్యారు. ఎంఆర్‌పీఎస్ గ్రామ ఉపాధ్యక్షులుగా జిక్కి నరసింహ మాదిగ, బోరెల్లి ప్రవీణ్ మాదిగ, నీరడి రాంబాబు మాదిగ, అధికార ప్రతినిధిగా బండారి మహేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా జిక్కీ విష్ణు మాదిగ, నీరడి ఆంజనేయులు మాదిగ,కోశాధికారిగా నాగపురి రాములు మాదిగ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా నీరడి రాజు మాదిగ, బోరెల్లి రాము మాదిగ, ధ్యావని రాజు మాదిగ, బండారు కురుమూర్తి మాదిగ, సహాయ కార్యదర్శులుగా డీఎన్ కృష్ణయ్య మాదిగ, బారు పెద్ద నరసింహ మాదిగ, బండారు వరుణ్ మాదిగ, ఈరపాగా వీరస్వామి మాదిగ, జిక్కి లోకేష్ మాదిగలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవని రమేష్ మాదిగ మాట్లాడుతూ పీడిత వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. సమాజంలో నెలకొన్న వివక్షలు, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని సూచించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాదిగలు ముందుకు వచ్చేలా యువతను ప్రోత్సహించాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామానికి ఎంఆర్‌పీఎస్ శ్రేణులు వెళ్లి ప్రజలను సంఘటితం చేయాలని, జాతి, సమాజాన్ని సంస్కరించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీలు ప్రజా సమస్యలపై స్పందిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే ఎంఆర్‌పీఎస్ జాతీయ మహాసభకు మండలం నుంచి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.





ప్రజాజ్యోతి

20 గురువారం, ఆగస్టు 2026



# స్టేషన్‌లోనే 'పెద్దమనిషి' తీర్పులు!

## రెవెన్యూ పంచాయతీల్లో పోలీసుల జోక్యం ఏంటి.?

## ఓ..కానిస్టేబుల్ తీరుపై ఫిర్యాదుదారుల అసంతృప్తి.. ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారం.?

**మహబూబ్ నగర్, ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పోలీస్ స్టేషన్ అంటే ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించే ప్రదేశం. కానీ అదే స్టేషన్‌లో పోలీసు సిబ్బంది పంచాయతీలు పెట్టి 'పెద్దమనిషి' తరహాలో తీర్పులు చెబుతున్నారన్న ఆరోపణలు వస్తే పరిస్థితి ఏమిటి? "కంచె చేను మేసినట్లు" వ్యవహారం మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.గండేడ్ మండలం కొత్మేద్పల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు భూ వివాదానికి సంబంధించి 17 వ తేదీ సోమవారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ వ్యవహారం రెవెన్యూ పరిధికి సంబంధించినదిగా ఉన్నప్పటికీ, స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఇరువర్గాలను కూర్చోబెట్టి పోలీస్ స్టేషన్‌లోనే పంచాయతీ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇరువర్గాలతో మాట్లాడి "పెద్దరాయుడి తీర్పు" తరహాలో వ్యవహరించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.రెవెన్యూ పరిధిలోని భూ వివాదాల విషయంలో పోలీసుల పాత్రకు పరిమితులు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా స్టేషన్‌లోనే పంచాయతీలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. "అధికారం చేతిలో ఉంటే ఆకాశమే హద్దు అన్నట్టుగా" వ్యవహరిస్తే పోలీస్ శాఖ ప్రతిష్టకే మచ్చ తెచ్చే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

### గతంలోనూ ఇదే తీరు.?:

ఇదిలా ఉండగా, ఆ కానిస్టేబుల్ గతంలోనూ పోలీస్ స్టేషన్ బయట కూర్చొని ఫిర్యాదుదారులతో పంచాయతీలు చెబుతూ, స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల దురుసుగా మాట్లాడేవారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్య చెప్పుకోవడానికి వచ్చిన వారితో సౌమ్యంగా వ్యవహరించాల్సిన చోట "వచ్చినవారిని ఆదుకోవాల్సింది పోయి.. వాకిట్లోనే వాక్చాతుర్యం చూపుతున్నారన్న" విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ గౌరవంగా వ్యవహరించడం, వారి ఫిర్యాదులను నిబంధనల ప్రకారం స్వీకరించి పరిష్కార మార్గం చూపడం పోలీసుల బాధ్యత. కానీ "పెద్దల మాటే చట్టం.. తమ మాటే తీర్పు" అన్న రీతిలో వ్యవహరిస్తే సామాన్యుడికి పోలీస్ వ్యవస్థపై ఉన్న నమ్మకం దెబ్బతినే అవకాశం ఉంది.

### ఉన్నతాధికారులు దృష్టి సారించాలి :

పోలీస్ స్టేషన్‌లోనే రెవెన్యూ వివాదాలపై పంచాయతీలు నిర్వహించారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో పోలీస్ స్టేషన్‌లు "సెటిల్‌మెంట్ అడ్డాలు" కాకుండా ప్రజలకు న్యాయం అందించే కేంద్రాలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "చట్టాన్ని కాపాడాల్సిన చేతులే చట్టం గీత దాటితే.. సామాన్యుడి పరిస్థితి ఏమిటి?" అన్న ప్రశ్న ఇప్పుడు గండేడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

# నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ

**కృష్ణా ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)**

నారాయణ పేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్ గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ లు గ్రామ సర్పంచ్, , ఉప సర్పంచ్,కాంగ్రెస్ నాయకులు వార్డ్ సభ్యులు అధికారులు, పంపిణీ కార్యక్రమంలో అధికారులు, లబ్ధిదారులు,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

